క్లుప్తంగా

మండలానికి 26 వీల్ చైర్‌లు



ఊట్కూరు: అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు మండలానికి సోమవారం 26 వీల్ చైర్‌లు ఎన్నికల అధికారులు పంపించినట్లు తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. మండలంలో 51 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయన్నారు. వికలాంగుల సౌకర్యం కోసం పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌లను ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌కు బస్సులను పెంచాలి

మరికల్: ఆత్మకూర్ మరికల్ మధ్యన బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. రెండు పట్టణాల మధ్యన సరైన బస్సులు లేక వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు రాత్రి 8 అయిందంటే చాలు బస్సులు లేక బస్టాండ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి 8 తర్వాత కూడా మరికల్ నుంచి ఆత్మకూర్ నుంచి బస్సులు ఉండాలన్నారు. రెండు పట్టణాల మధ్యన కేవలం రెండు బస్సులు మాత్రమే నడిపించడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనలను సంప్రదించాల్సినా పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్సులను నడిపించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



అమరచింత: మండలంలోని మస్తీపురం ఎక్స్ రోడ్‌తో పాటు నర్వ, మక్తల్ ప్రధాన రహదారుల వెంట సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఎస్‌టీ టీం–6 కోఆర్డినేటర్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అమరచింత, ఆత్మకూర్ మీదుగా వెళ్తున్న వాహనాలతో పాటు మరికల్, మక్తల్ వెళ్తున్న ప్రతి వాహనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఈ క్రమంలో నాగల్‌కడ్మూర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారంతో పాటు చేరికలు ఉన్నాయని తెలియడంతో వాహనాలను తనిఖీ చేశామన్నారు. నగదు, మద్యం అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పలువురికి సూచనలు చేసినట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూర్: భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలలో భాగంగా సోమవారం పట్టణంలోని సేవామందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మందికి ఉపయోగపడుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాష అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తిప్పారెడ్డి, వేణుగోపాల్, రఘు, ముక్తేశ్వర్, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం..

కోస్గి మున్సిపల్ కేంద్రంలోని ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సోమవారం కోస్గి మున్సిపల్ కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

- నర్వ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ ముమ్మరంగా ప్రచారం కొనసాదింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు చిట్టెం చాణిక్యారెడ్డి పలు గ్రామాల్లో ప్రచారం చేసి మాట్లాడారు..
- బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు సంక్షేమపాలన అందుతుందని రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ సూచించారు. ఈ మేరకు సోమవారం కోస్గిలోని స్థానిక విలేకరులతో మాట్లాడారు.. అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థి బంటు రమేష్‌ను గెలిపించాలని కోరారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం బీజేపీ అభ్యర్థి బంటు రమేష్ ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.
- రేవంత్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సోమవారం కోస్గి పట్టణంలో ప్రచారం చేసి మాట్లాడారు.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మెనిఫెస్టోను ప్రజలకు వివరించారు.
- బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ధన్వాడ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డితో పాటు పలువురు నాయకులు మరికల్‌లోని నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు మరికల్ వార్డుసభ్యులు ఖాజతో పా టు 50మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వచ్చారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి



కోయిల్‌కొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/కోయిల్‌కొండ : 'బంగారు తెలంగాణ దిశగా అన్ని రంగాల్లో అభివృద్ధిలో...ప్రజా సంక్షేమంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ సర్కారే...హ్యాట్రిక్ సీఎం అయ్యేది సీఎం కేసీఆరే' అని బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే వివిధ నూతన పథకాలను అమలు చేస్తామని భరోసానిచ్చారు. కోయిల్‌కొండ, గాంధీనగర్, చింతల్ తండా, జమాల్‌పూర్, పలుగుతండా, అనంతపూర్ గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. రాష్ట్రం పదేళ్లక్రితం ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ ఇస్తుందని రాజేందర్‌రెడ్డి అన్నారు.

కోటకొండకి చెందిన కమ్యూనిస్టు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ధన్వాడ మండలంలోని గున్ముక్ల, యంనోనిపల్లి, రాంకిష్టయ్య పల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. దామరగిద్ద మండలంలోని మద్దేల్ బీడు, వత్తుగుండ్ల, కానుకుర్తి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నారాయణపేట బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పల్లా రఘు, నగర కార్యదర్శి రాజ గోపాల్‌లు గులాబీ గూటికి చేరారు.

కమలం...కాంగ్రెస్‌లవి మాయమాటలు

కమలం, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మే పరిస్థితిలో జనం లేరని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ప్రజలకు అర్థ మయ్యేలా వివరిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ ప్రభుత్వం పై చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు తమకు తెలుసని ప్రజలు బీఆర్ఎస్‌కు బాసటగా నిలిచి నారాయణపేట నియోజకవర్గ మరింత అభివృద్ధి చేసేందుకు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎస్ఆర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు.

తెలుగు కవుల చిత్రపటాల ప్రదర్శన



తెలుగుకవుల చరిత్రను విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు : తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేసేందుకు మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగుకవుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. కవుల రచనలు, వారి చిత్రాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం బాలయ్య, మాట్లాడుతూ.. జన్మతో వచ్చిన అమ్మభాషను మర్చిపోవద్దన్నారు. తెలుగుభాష అంతరించి పోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సబ్బంది శన్ముశ్రీ, హన్మంతు, సతీష్ పాల్గొన్నారు.

అందుబాటులో వరివిత్తనాలు

నర్వ: మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సీఈఓ ఉదయ్‌కుమార్ తెలిపారు. కెఎన్ఎం 1188, ఎంటీయు 1010 రకాలు ఉన్నాయన్నారు. 25 కేజీలు కలిగిన ఒక్కో బస్తా ధర రూ. 881 ఉంటుందన్నారు. రైతులు తమ పట్టదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు జీరాక్స్‌లను తీసుకొచ్చి విత్తనాలు తీసుకపోవాలని ఆయన సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి, అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: కేంద్రం ప్రభుత్వం ఢిల్లీ నుంచి గల్లీ వరకు సంక్షేమ పథకాలు ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో పేదలకు అందిస్తుందని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. సోమవారం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఊట్కూర్ మండలం ఎర్గట్‌పల్లి, మాగనూర్ ఓబ్లాపూర్, వడ్వాట్‌లో ప్రచారం కొనసాగించారు. గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రచార కార్యక్రమంలో కొండయ్య, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, కర్నిస్వామి, నాగప్ప, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి అన్నారు. సోమవారం మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ఆనంద్, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కుర్నిఉదయ్, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్ తదితరులు ఉన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



నారాయణపేట రూరల్ : క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో జిల్లా స్థాయి అండర్–17 కబడ్డీపోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడలకు సమయం కేటాయిస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారుచేయొచ్చన్నారు. మనిషి జీవితంలో వ్యాయామానికి మించిన మెడిసిన్ లేదన్నారు. క్రీడా కోటలో సైతం ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుకు సీట్లు పొందె అవకాశం ఉంటుందన్నారు. చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జట్టును ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, పీఈటీలు నర్సింహులు, రమణ, నెల్సన్, సాయినాథ్, వెంకటప్ప, శ్రీధర్, రమేష్, విష్ణు, వెంకటేష్; అనంతసేనా, రాజేశ్వరీ, రాధిక, స్వప్న, కృష్ణవేణి, చక్రవర్తి పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరలో మంగళసూత్రాల అపహరణ

చిన్నచింతకుంట: కురుమూర్తి జాతరలో ఇద్దరు మహిళా భక్తుల మంగళసూత్రాలు అపహరణకు గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతర కోనేరులో భక్తులు స్నానాలు ఆచరిస్తుండగా ఘటన చోటు చేసుకుంది. మహబుబ్‌నగర్ జిల్లా కోటకద్ర గ్రామానికి చెందిన కోస్గి మంజుల (4 తులాలు), గద్వాల పట్టణానికి చెందిన కోరి స్వాతి (2 తులాలు) మంగళ సూత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో ఇరువురు బాధితులు చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీను, సలహాదారులుగా గోపీ, రాజన్న, వెంకటేష్, ఆంజనేయులు, శివశంకర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు.

ఆశీర్వదించండి.. ప్రజల వెంటే ఉంటా



నాగల్ కడ్మూర్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

అమరచింత: ఒక్కసారి ఆశీర్వదించి గెలిపిస్తే నిత్యం నియోజకవర్గ ప్రజల వెన్నంటే ఉంటానని మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో అమ్మపురం దొర శ్రీరాంభూపాల్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్, టీడీపీ నుంచి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. నాగల్‌కడ్మూర్, అమరచింత, ఆత్మకూర్, నర్వ, చెందిన పలువురు అమ్మపురం సంస్థానదీశుడు రాజా శ్రీరాం భూపాల్, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజలను కులాల వారీగా విభజించి వారిలో మతవిద్వేశాలను రగిల్చి దేశ సంపదను దోచుకోవడంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కగూటి పక్షులన్నారు. దేశ ప్రజల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవడమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగ విఫలమైందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రజలు మతోన్మాద రాక్షసుల చేతిలో ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోనే స్థితిలో ప్రధాని లేరన్నారు.

ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయం

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని మక్తల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. నియోజకవర్గంలోని మండలంలోని అంజప్ప ఆధ్వర్యంలో దాదాపు వంద మందికి పైగా వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చిట్యాల కో ఆప్షన్ సభ్యుడు రహిమాత్ పాష ఆధ్వర్యంలో పలువురు చేరారు. వారికి కండువాలతో సన్మానం చేరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి నేటి వరకు ఉందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. అనంతరం మక్తల్‌లో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, లక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, హన్మంతు, ప్రశాంత్ కుమార్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, గోపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంటా, ఐనాపూర్, అలంపల్లి, తంగిడి, గుర్జాల్, కృష్ణా, హిందుపూర్‌లో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. యువకులు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం పక్కా..



మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి శరణుప్రకాశ్‌పాటేల్

నారాయణపేట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం పక్కా అని కర్ణాటక మెడికల్ హెల్త్‌శాఖ మంత్రి డాక్టర్ శరణుప్రకాష్ పాటేల్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చిట్టెం పర్నికారెడ్డికి మద్దతుగా ముదిరాజ్‌ల ఆత్మీయుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. నియోజకవర్గంలో అత్యధికంగా ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజలు ఉన్నారని అధికారంలోకి రాగానే ముదిరాజ్‌కుల న్యాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమ లు చేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పర్నికారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న రాయిచూర్ దొర పాలనా కావాలా.. ప్రేమతో ఉండే శివకుమార్‌రెడ్డి దోస్త్ కావాలో ప్రజలు ఆలోచించాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా పార్టీ అభ్యర్థి చిట్టెం పరిపరిపర్నికారెడ్డి మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు నరహరి, కొనంగేరి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: అస్సాం రాష్ట్రం గౌహతిలో ఈనెల 23నుంచి 26 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్, జూనియర్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు తెలిపారు.

ప్రజలకు ఓటరుచీటీల పంపిణీ



ఓటరు స్లిప్‌లు అందజేస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: ప్రజలకు ఓటరు స్లిప్‌లను త్వరగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా ప్రలోబాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రాజశ్రీనాథ్‌ను అభినందిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ స్కాలర్ రాజ శ్రీనాథ్‌కు సోమవారం పీయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 'సూక్ష్మజీవుల సంవర్ధనం, సంవర్ధనం చేయలేని లైపేజ్, ప్రొటియేజ్ ఎంజైమ్స్' అంశంపై రీసెర్చ్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, తదితరులు అభినందించారు. అధ్యాపకులు శాంతిప్రియ, మధుసూదన్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వరికోత మిషన్ల కొరత

- జిల్లాలో ఊపందుకున్న వరికోతలు
- యంత్రాలకు పెరిగిన డిమాండ్
- గంటకు రూ.2,800- 3,500 వరకు వసూలు
- రైతులకు అకాల వర్షాల భయం



మరికల్ శివారులో వరిపంట కోస్తున్న యంత్రం

మరికల్: మండల వ్యాప్తంగా వర్షాకాలం వరికోతలు జోరందుకోవడంతో కోత మిషన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా కోతలు ఆలస్యం కావడం, మళ్లీ అకాల వర్షాలు వచ్చే భయంతో రైతులు వెనువెంటనే కోతలను చేపడుతున్నారు. ఒకవైపు పంటను కాపాడుకోవాలనే తపనతో రైతులు ఆరాటపడుతుండగా.. మరోవైపు కోత యంత్రాల కొరతతోపాటు కూలీలు, రవాణా చార్జీలు పెరగడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. డీజిల్, పెట్రోల్ ధరలను సాకుగా చూపుతూ యంత్రాల యజమానులు వాహనాల డ్రైవర్ల చార్జీలను భారీగా పెంచుతున్నారు. జిల్లాలో కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద సాగుచేసిన వరిపంటల కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 1.26 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. కోతలు కూడా అదేస్థాయిలో పెద్దఎత్తున సాగుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం 14 ఉంటేనే కొనుగోలు చేస్తారు. అంత వరకు ఆరబెట్టాలి. అకాల వర్షం భయం పట్టుకోవడంతో రైతులను మోసం చేస్తూ కొందరు దళారులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తూ కాసులు కళ్ల చూస్తున్నారు.

యంత్రాలపైనే ఆధారం..

వరికోతలకు 90 శాతంపైగా యంత్రాలనే వాడుతున్నారు. ఇదే సమయంలో రైతుల అవసరాలను సొమ్ముచేసుకునేందుకు వరికోత మిషన్ల యజమానులు ధరలను పెంచారు. కోత యంత్రాల కొరత జిల్లాలో తీవ్రంగా ఉండటంతో గంటకు రూ.2,800 నుంచి రూ.3,500 వరకు డిమాండ్ ఉంది. గత వర్షాకాలంలో వరి కోతలు చేసే టూ వీలర్ హార్వెస్టర్ యంత్రానికి గంటకు రూ.2,200 ఉండగా.. ఈసారి దానిని రూ.2,400కు పెంచారు. ఫోర్ వీలర్ మిషన్‌కు గతంలో గంటకు రూ.2,400 ఉండగా ప్రస్తుతం రూ.2,800కి పెంచారు. తడి నేలల్లో సైతం వరిని కోసే ట్రాక్ యంత్రానికి గతంలో గంటకు రూ.3 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.3,500కి పెంచారు. దీంతోపాటు గడ్డిని కట్టగట్టే బేలర్ యంత్రం యజమానులు గతంలో కట్టకు రూ.20 ఉండగా రూ.40కి పెంచారు. బస్తాల్లోకి, ట్రాక్టర్ల మీదకు చేర్చేందుకు కూలీ రెట్టింపయ్యింది. గతంలో బస్తాకు రూ.20 ఉండగా ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ధాన్యాన్ని ఇళ్ల వద్దకు తీసుకెళ్లేందుకు యజమానులు రవాణా చార్జీలను భారీగా పెంచారు.

ప్రతిభచాటిన విద్యార్థులకు అభినందన



నారాయణపేట రూరల్ : జాతీయ కుంపూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రుషికుమార్, సాయిప్రణవ్, హర్షవర్ధన్, నరేందర్‌గౌడ్ చక్కటి ప్రతిభ చూపి బంగారు పథకాలు సాధించారు. అదేవిధంగా ఖలీం, రాహుల్, నరహరి, రియాజ్, సాత్విక్‌లు వెండి, స్టీఫెన్, భూపతి, వెంకటేష్ కాంస్య పతకాలను సాధించారు. ఆయా విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఖాజా హుస్సేన్, అబ్దుల్ అలీం, శివకుమార్‌గౌడ్, నారాయణ అభినందించారు.

పాలమూరు కవులకు సాహిత్య పురస్కారాలు



సాహిత్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన కవులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి విమల సాహితి సమితి జాతీయ సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జెల్ది విద్యాధర్‌రావు రచించిన 'తోటమాలి మాలిమి' పుస్తకావిష్కరణ సందర్భంగా నిర్వహించిన జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవంలో జిల్లా కవులు ఈ పురస్కారాలను అందుకున్నారు. జాతీయ పురస్కారాలను పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న తదితరులు అందజేశారు.